క్లుప్తంగా

గరుడ వాహనంపై కోదండరాముడు



చేజర్ల : మండలంలోని కొట్టాలు గ్రామంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముడిని గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం

ఉదయగిరి : మండలంలోని పప్పులవారిపల్లి గ్రామంలో కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణ తంతు జరిపించారు. అలాగే గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గొర్రెల చోరీ ముఠా పోలీసులకు అప్పగింత

వరికుంటపాడు : మండలంలో గొర్రెలు అపహరించేందుకు వచ్చిన ఓ ముఠాను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని ఇస్కపల్లి గ్రామ శివారు ప్రాంతంలోని సవటవాగు సమీపంలో గొర్రెలు మేత మేస్తుండగా కొందరు ఆటోలో అటువైపుగా వచ్చి ఓ గొర్రెను అపహరించుకుపోయారు. గమనించిన జీవాల యజమాని పి.సుబ్బారావు స్థానికులను అప్రమత్తంగా చేశారు. వారిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ గ్రామం వడ్డిపాళేనికి చెందిన గోవింద్, గణేష్, మోహన్, దుర్గలతో పాటు ఆటోను పోలీసులకు అప్పగించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు జీవాల యజమానులు, కాపరులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇటీవల తమ గొర్రెలను అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతయ్య తెలిపారు.


మడపల్లి సచివాలయంలో వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

చేజర్ల : మండలంలోని మడపల్లిలో 104 వాహనం ద్వారా బుధవారం రోగులకు వైద్యసేవలు అందించారు. మడపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ విటమిన్‌లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఆకుకూరలు తీసుకుంటే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో చేజర్ల పీహెచ్‌సీ వైద్యులు గిరీష్, సీహెచ్‌ఓ చంద్రయ్య, హెచ్‌వీ బి.నరసమ్మ, సిబ్బంది పి.మమత, నిర్మల, సుభద్రమ్మ పాల్గొన్నారు.

పరపతి సంఘ సీఈఓ ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్సై

ఉదయగిరి : పట్టణంలోని బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరగ్గా, బుధవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సీఈఓగా విధులు నిర్వహిస్తున్న రేకలగుంట పోలయ్య ఈనెల 19వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి కంటి ఆపరేషన్ నిమిత్తం భార్యతో కలిసి తిరుపతి వెళ్లారు. శస్త్ర చికిత్స చేయించుకుని బుధవారం రాత్రి ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలి గదిలోకి వెళ్లగా బీరువా తలుపులు తెరిచి ఉండడం, వస్తువులు చెల్లాచెదరుగా ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలం చేరుకుని పరిశీలించగా, బీరువాలోని రెండు సవర్ల బంగారు చైన్, రెండు జతల బంగారు కమ్మలు, రూ.28 వేల నగదు, రూ.20 వేల విలువ చేసే వెండి సామగ్రి చోరీకి చేసినట్లు గుర్తించారు. గురువారం క్లూస్ టీమ్‌తో పరిశీలిస్తామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై మృత్యు ఘంటికలు

హైవేపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మితిమీరిన వేగం, నిద్రమత్తు, రోడ్డు పక్కన నిలిపి ఉంచుతున్న లారీల కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. డ్రైవర్ల స్థానంలో క్లీనర్లు వాహనాలు నడపడం, ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు అనుభవం లేని డ్రైవర్లతో దూర ప్రాంతాలకు బస్సులు నడుపుతుండడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

- అతివేగం.. ఆగిఉన్న లారీలతో నిత్యం ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న నిండు ప్రాణాలు



సున్నపుబట్టి వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

కావలి : కావలి–దగదర్తి మండలాల మధ్య నాలుగు నెలల్లో జరిగిన ప్రమాదాల్లో 20 నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. దీనిని బట్టి ఈ రహదారిపై ప్రమాదాల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

➡ గత ఫిబ్రవరి నెలాఖరులో ముసునూరు టోల్ ప్లాజా సమీపంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందగా 15 మంది తీవ్రంగా గాయపడిన ఘటన తెలిసిందే. రెండు లారీలు, ఓ ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ఎనిమిది కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో 16 చక్రాల టర్బో లారీని క్లీనర్ నిద్రమత్తులో అతివేగంగా నడిపి ముందు వెళ్తున్న లారీని, అవతలివైపు రోడ్డులో వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొట్టడమే ప్రమాదానికి కారణమని తెలిసింది.

➡ అదేవిధంగా ఏప్రిల్ 16వ తేదీన గౌరవరం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. జలదంకి మండలం చామాదలకు చెందిన కుటుంబం శ్రీరామనవమి వేడుకలకు అవసరమైన పూజా సామగ్రి కోసం కారులో వెళ్తూ లారీని ఢీకొట్టంతో రెండేళ్ల పసికందు సహా ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే.

➡ పై ఘటన జరిగి ఎనిమిది రోజులు గడవకముందే ఏప్రిల్ 24వ తేదీ వేకువన మరో ఘోరం చోటుచేసుకుంది. చెన్నై నుంచి ఏలూరు వెళ్తున్న కారు టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన కంటైనర్ లారీని ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు వైఎస్సార్ నగర్‌కు చెందిన ఇమిటేషన్ జ్యూవెలరీ వ్యాపారులు కుమార్ (45), జ్యోతి (38), సిరి అలియాజ్ రాజీ (38) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ రెండు ప్రమాదాలకు కారణంగా రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన లారీలే కావడం గమనార్హం. వీటితో పాటు వేర్వేరు ప్రమాదాల్లో మరో ఇద్దరు వరకు మృత్యువాత పడ్డారు.

➡ తాజాగా దగదర్తి మండలం సున్నపుబట్టిలో బుధవారం వేకువన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మితిమీరిన వేగంతో అదుపుతప్పి డివైడర్‌ను, అవతలి రోడ్డులో వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే డ్రైవర్ మృతిచెందగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు డ్రైవర్ నిద్రమత్తులో మితిమీరిన వేగంతో బస్సును నడపడమే కారణమని తెలుస్తోంది.



వేగంగా జరుగుతున్న సహాయక చర్యలు

ప్రమాదాల నియంత్రణకు చర్యలేవీ?

హైవేపై మృత్యు ఘంటికలు మోగిస్తున్నా.. ప్రమాదాలను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖలైన పోలీసు, ఆర్టీఓ విభాగాలు చోద్యం చూస్తున్నాయి. కంకర, ఇసుక, గ్రావెల్, ప్రకాశం జిల్లా నుంచి పోర్టుకు వెళ్లే గ్రానైట్ లారీల దగ్గర డబ్బులు దండుకోవడం తప్ప ప్రజల ప్రాణాలు బలిగొంటున్న ప్రమాదాలను అరికట్టే దిశగా సంబంధిత శాఖలేవీ స్పందిస్తున్న దాఖలాలు లేవు. ముసునూరు టోల్‌ప్లాజా వద్ద, గౌరవరం దాబాల వద్ద, ఉలవపాళ్ల కూడలి వద్ద, సున్నపుబట్టీ వద్ద కాపుకాసి మరీ లారీల నుంచి డబ్బులు వసూలు చేసే ఖాకీలు కనీసం రోడ్డు పక్కన నిలిపి ఉంచుతున్న లారీలను కూడా తీయించలేకపోతున్నారు. దాబా హోటళ్ల వారు ఇచ్చే నెలవారీ మామూళ్లు, ఉచితంగా పెట్టే ఆహారం కోసం రోడ్డుపైన ప్రమాదకరంగా నిలుపుతున్న లారీలను కూడా పట్టించుకోవడం లేదు. పోలీసులతో సమానంగా దర్పం చూపిస్తూ హైవేపై నిత్యం హడావుడి చేసే టోల్ సిబ్బంది, హైవే సిబ్బంది కూడా లారీల నిలుపుదల విషయంలో నోరు మెదపడం లేదు. అదే విధంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను మధ్యలో తనిఖీలు చేయడం, డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేయడం కూడా పూర్తిగా అటకెక్కించేశారు.

భక్తిశ్రద్ధలతో నృసింహుని జయంతి



పూజా సామగ్రి, సారెను ఎద్దుల బండిపై తీసుకెళ్తున్న భక్తులు

ఆత్మకూరు : పట్టణంలోని పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నృసింహుని జయంతిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంట వీధి నుంచి మేళతాళాలతో సాంప్రదాయబద్ధంగా ఎద్దుల బండిపై పూజా సామగ్రిని, అమ్మవారికి సారెను తీసుకెళ్లారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిపించి ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

నేడు కల్యాణం

నృసింహుని జయంతి మహోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భారీ అన్నదానం కార్యక్రమం జరుగుతుందన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

ఉదయగిరి : ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో వివాదాలకు పాల్పడి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. మండలంలోని గంగిరెడ్డిపల్లిలో వారు బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున 6వ తేదీ వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గ్రామాలు శాంతియుతంగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలు తలెత్తినా తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరిలో పోలీసుల కార్డన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న ఎస్సై

ఉదయగిరి : పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు చూపని అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వాహనానికి ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. జూన్ 6వ తేదీ వరకు పోలీస్–30 యాక్ట్ అమలులో ఉంటుందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో కొత్త వాహనాలు, కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారాతో తీవ్ర ఇబ్బందులు



చికిత్స పొందుతున్న బాధితురాలు



బాధితురాలిని పరామర్శిస్తున్న వైద్యులు

- వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి : మండలంలోని సర్వాయపాళెం పంచాయతీ మాతినవారిపాళెం గ్రామంలో కొందరు అతిసారాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ యానాది ఈ సమస్యను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నేరుగా గ్రామంలోని బాధితులతో ఫోన్‌లో మాట్లాడారు. అతిసారా వల్ల కిడ్నీలపై కూడా ప్రభావం చూపుతున్నట్లు బాధితులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో ఆయన వైద్యారోగ్య సిబ్బంది, వైద్యులు, వైద్యశాఖ అధికారుల దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లారు. కాగా ఎమ్మెల్యే సూచనల మేరకు గ్రామంలో తాగునీటి వనరులను పరిశీలించగా, సురక్షితంగానే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. కాగా పాడైపోయిన రొయ్యలను గ్రామంలోని కొందరికి విక్రయించారు. వాటిని తిన్న వారికి మాత్రమే ఆరోగ్య సమస్యలు తలెత్తాయని భావిస్తున్నారు. కాగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి బుధవారం పరామర్శించారు.

ఖరీదైన ప్రభుత్వ స్థలం కబ్జా



కావలి : పట్టణంలోని ముసునూరులో నెల్లూరు రోడ్డుపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉన్న ఖరీదైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. చిన్న గదిని నిర్మించిన ఆక్రమణదారులు అధికారులకు సవాల్ విసిరారు. రూ.కోట్ల విలువ చేసే స్థలంపై చాలా ఏళ్లుగా పలువురి కన్ను పడినప్పటికీ, అధికారులు వారి నుంచి కాపాడుతూ వచ్చారు. కాగా అధికారులు ఎన్నికల మూడ్‌లో ఉండడంతో కబ్జాదారులు ధైర్యం చేసి దర్జాగా కబ్జా చేశారు.

భూసార పరిరక్షణపై అవగాహన ర్యాలీ



గండిపాళెంలో చేపట్టిన అవగాహన ర్యాలీ

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం గ్రామాల్లో వ్యవసాయాధికారి ఎ.ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో భూసార పరిరక్షణపై బుధవారం అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు సదస్సులు జరుగుతాయన్నారు. రసాయన ఎరువుల వాడకం నుంచి పంటను, భూమిని సంరక్షించుకోవాలన్నారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం, నానో ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు, జీవసంబంధిత ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. వీటి వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చన్నారు. రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంఈఓలు

ఉదయగిరి : మండల పరిధిలో జరుగుతున్న మనబడి, నాడు– నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓలు షేక్.మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని బిజ్జంపల్లి ఉన్నత పాఠశాల, జి.చెరువుపల్లి హరిజనవాడ, బోడబండ, కుర్రపల్లి ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను వారు బుధవారం పరిశీలించారు. గదుల సీలింగ్, మరుగుదొడ్ల ఏర్పాటు, కరెంటు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. వారి వెంట హెచ్‌ఎంలు టి.వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాషా, సుభాషిణి, మాల్యాద్రి, సిబ్బంది ఉన్నారు.

పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

ఆత్మకూరురూరల్ : భూసార పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సూచనల మేరకు సాగు చేపట్టాలని ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని చెర్లోయడవల్లి రైతు భరోసా కేంద్రంలో పీఎం ప్రణామ్ పథకం కింద రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర పోషణ యాజమాన్యంతో పాటు భూసార పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులను పంటల సాగులో వినియోగించాలన్నారు. మండల ఏఓ కిశోర్‌బాబు మాట్లాడుతూ నేల పరిరక్షణకు ప్రతి రైతు పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీహర్ష, స్థానిక రైతులు పాల్గొన్నారు.

‘హంస’ నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సహ ఉద్యోగులు

ఉదయగిరి : స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంసా) ఉదయగిరి తాలూకా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్, జనరల్ సెక్రటరీ కిరణ్ అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షుడు కె.నారాయణరాజు, షేక్.జలీల్‌అహ్మద్ ఆధ్వర్యంలో ఉదయగిరి తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా కె.వెంకటసుబ్బయ్య, అసోసియేట్‌గా ఓంకారం శేఖర్‌రాజు, స్థానిక సెక్రటరీ, ట్రెజరర్లుగా నౌషాద్‌బాబు, పి.హసనయ్య, ఆర్గనైజింగ్ పబ్లిసిటీ సెక్రటరీలుగా షేక్.బీబీజాన్, ఎ.శ్రీనివాసులును ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు షంషుద్దీన్, వినీత, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

- ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన

సంగం : ప్రజలకు ఉపయోగపడే మురుగు కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిని నిలుపుదల చేయాలంటూ మండలంలోని తలుపూరుపాడు మాజీ సర్పంచ్ కరిముల్లా ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు బుధవారం విన్నవించారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపట్టారు. తలుపూరుపాడు సర్పంచ్ కుటుంబసభ్యులు మురుగు కాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏఓ జ్యోతికి ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులే ఆక్రమణ చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- కారు–లారీ ఢీకొన్న ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం
- భార్య, తల్లి, మేనల్లుడికి తీవ్రగాయాలు
- విషమంగా తండ్రి సుబ్బారెడ్డి పరిస్థితి







ఉదయగిరి, దుత్తలూరు : ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో ఉన్న మొక్కును తీర్చుకునేందుకు కుటుంబంతో కలిసి తిరుమల వెళ్లారు. దైవ సన్నిధిలో కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపారు. అనంతరం ఇంటికి బయలుదేరారు. కొద్ది గంటల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న సమయంలో పాలలారీ రూపంలో ప్రమాదం వెంటాడింది. దుత్తలూరు మండలం చింతలగుంట వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో భర్త మృతిచెందగా, భార్యతో పాటు ఇతర కుటుంబసభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలం ఉప్పలపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (హైదరబాద్‌లో పనిచేస్తున్నారు) వెంకటేశ్వరరెడ్డి (28)కి ఆరు నెలల క్రితం మంజులతతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో సెలవులు లేకపోవడంతో తిరుమల దైవ దర్శనానికి వెళ్లలేదు. మూడు రోజుల క్రితం సొంతూరు వచ్చి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి నారాయణమ్మ, మేనల్లుడు అభిరూప్, భార్య మంజులతతో కలిసి మంగళవారం కారులో తిరుమల వెళ్లారు. దైవ దర్శనం చేసుకుని బుధవారం సాయంత్రం కారులో ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్కాపురం నుంచి పాలప్యాకెట్లతో వస్తున్న లారీ చింతలగుంట వద్ద కారును ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న వెంకటేశ్వరరెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. భార్య మంజులతకు కాలు నుజ్జునుజ్జు అయింది. తండ్రి సుబ్బారెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. నారాయణమ్మ, అభిరూప్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరికి ఉదయగిరి వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి నెల్లూరుకు తరలించారు. దుత్తలూరు ఎస్సై ఉమశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున దీర్ఘకాలిక, సాధారణ రోగులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. మండలంలోని నార్తుకొండాయపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులతో పాటు ఇతర రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు, సలహాలు అందించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులు, ప్రజలు ఎండల్లో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

